సాక్షి జగిత్యాల

7

శనివారం : 27 : జనవరి : 2024

న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వరునికి క్షీరాభిషేకం



వేంకటేశ్వరస్వామి వారు

ధర్మపురి: నృసింహస్వామి సన్నిధిలోని శ్రీవేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజలు, లక్ష్మీహవన చేశారు.

మహిళాగ్రూపులకు రూ.135.74 కోట్ల రుణాల పంపిణీ



రుణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

జగిత్యాలఅగ్రికల్చర్: కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో మహిళా గ్రూపులకు రూ.135.74 కోట్ల రుణాలను కలెక్టర్ యాస్మిన్ బాషా పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ కింద 911 గ్రూపులకు రూ.100.50కోట్లు, స్త్రీనిధి కింద 1805 గ్రూపులకు రూ.33.14కోట్లు, పట్టణ పేదరిక నిర్మూలన పథకం కింద రూ.2.10 కోట్లు పంపిణీ చేశారు. వివిధ పథకాల కింద స్కూటీలు అందించారు.

జైలు హెడ్‌వార్డర్‌కు రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు



జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా నుంచి అవార్డు అందుకుంటున్న మజారోద్దీన్

జగిత్యాలజోన్: జగిత్యాల స్పెషల్ సబ్ జైలు హెడ్‌వార్డర్ మజారోద్దీన్‌కు జైళ్లశాఖ రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు అందించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ శౌమ్యమిశ్రా నుంచి ప్రశంసాపత్రం, నగదు బహుమతితో కూడిన ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తెచ్చేందుకు ప్రయత్నించడంతోపాటు వారికి అవసరమైన వసతులు కల్పించడంలో మజారోద్దీన్ కీలకపాత్ర పోషించారు. జిల్లా జైలు స్పెషల్ సూపరింటెండెంట్ మొగిలేష్, తోటి సిబ్బంది అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని శుక్రవారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జగిత్యాల పట్టణ శివారులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంజన తోటి విద్యార్థుల ముందు ఉపాధ్యాయుడు మందలించాడని మనస్తాపానికి గురై ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థిని చికిత్స పొందుతోంది.

వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఖాద్రి



ఎమ్మెల్యేను కలిసిన మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా ఖాద్రి

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్.ఖాద్రి నియమితులయ్యారు. ప్రిన్సిపాల్ శివరాంప్రసాద్ డీఎంఈ అకడమిక్ ఇన్‌చార్జిగా నియమితులు కావడంతో ఖాద్రికి బాధ్యతలు ఇచ్చారు. ఆయన శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

అర్హులందరికీ ఫలాలు

జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం

జిల్లాలో అర్హులందరికీ సంక్షేమఫలాలు అందించేలా పనిచేస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. 75వ గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. మహాత్మగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలు మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ గృహజ్యోతి, యువ వికాసం, చేయూత పథకాలను ప్రజల దరికి చేరుస్తున్నామని తెలిపారు. అన్నివర్గాల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన కార్యక్రమాన్ని 383 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీలు, 134వార్డుల్లో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 190 టీంలు 3,502 కౌంటర్ల ద్వారా 3,35,781 దరఖాస్తులు స్వీకరించామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీలో మహిళలకు డిసెంబర్ 9 నుంచి ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని, ఈ పథకం ద్వారా ఆర్టీసీకి అధిక లాభాలు వస్తున్నాయని పేర్కొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



రాయికల్‌రామలక్ష్మణుల వేషధారణలో..



రాయికల్: ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

- ప్రభుత్వ పథకాల అమలులో అగ్రగామి
- కలెక్టర్ యాస్మిన్ బాషా వెల్లడి
- కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- హాజరైన పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు







రాయికల్: వివిధ వేషధారణలో చిన్నారులు..



వేదికపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్, అధికారులు



జగిత్యాలటౌన్: చిన్నారి నృత్యం



జగిత్యాలటౌన్: చిన్నారి ప్రదర్శన



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్



రాయికల్:జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

జగిత్యాల: రాజీవ్ ఆరోగ్యశ్రీతో పేదలకు మెరుగైన వైద్యసేవలు, వైద్యసదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రూ.5 లక్షల పరిధి నుంచి రూ.10లక్షల వరకు పెంచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు రూ.4కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఇప్పటివరకు 1,822 శస్త్రచికిత్సలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకున్నారని తెలిపారు.

రైతుకు ప్రాధాన్యత

రైతేరాజుగా ఉండాలన్న ఉద్దేశంతో రైతుభరోసా పథకం ద్వారా రైతులు, కౌలు రైతులకు ఎకరాన రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12వేల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ యాసంగిలో 1,54,562 మంది చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో రూ.69.18 కోట్లు జమ చేశామన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్స్ మించని గృహ యజమానులకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయంతోపాటు,



జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో చిన్నారుల ప్రదర్శన

ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ.5 లక్షల సహాయం అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చేయూత పథకం ద్వాదా పెన్షన్‌ను రూ.4వేలు, దివ్యాంగులకు రూ.5వేలకు పెంచి త్వరలోనే అందిస్తామని పేర్కొన్నారు.

యువతకు ఉపాధి

యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో స్కిల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని, సమస్యలున్న వారు నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రతి లబ్ధిదారుడికి అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తున్నామన్నారు.



జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో ప్రదర్శనలు

అన్ని రంగాల్లో అగ్రగామి

జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు పార్లమెంట్, జిల్లా పరిషత్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సహకారం బాగుందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శాంతిభద్రతలకు కృషి చేస్తున్న జడ్జీలు, ఎస్పీకి అభినందనలు తెలిపారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ పారదర్శకంగా శక్తివంచన లేకుండా కృషి చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుదామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు కలెక్టర్లు లత, దివాకర, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జగిత్యాలటౌన్: గణతంత్ర వేడుకల సందర్భంగా సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల చిన్నారులు ఆటపాటలతో అలరించారు. వారిని కలెక్టర్, అదనపు కలెక్టర్లు అభినందించారు.

రైతుల పొలాలు ఎండనివ్వం

- చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం
- ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కాలువలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు

గొల్లపల్లి: యాసంగిలో రైతుల పొలాలు ఎండనివ్వబోమని, చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రైతులకు సాగునీటిని అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని డి-64, కాకతీయకాలువలను శుక్రవారం పరిశీలించారు. పూడిక నిండిపోయి, అధ్వానంగా ఉన్న కాలువలను చూసి చలించిపోయారు. చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలువలోని చెత్తను తొలగించేందుకు సొంత ఖర్చుతో జేసీబీని ఏర్పాటు చేసిన గొల్లపల్లి సర్పంచ్ ముస్కు నిషాంత్‌రెడ్డిని అభినందించారు. డి-64 కాలువలో నీటి ప్రవాహం తక్కువ ఉండడంపై డీఈలతో మాట్లాడారు. నీటి ప్రవా హ సామర్థ్యం పెంచి చివరి ఆయకుట్టుకు నీరు చేరేలా చూడాలని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని, నాలుగురోజుల్లో సాగునీటిని అందిస్తామ ని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తలాపున గోదావరి ఉన్నా.. ఇక్కడి రైతాంగానికి సాగునీరందలేదని, కాలువల ద్వారా ఇక్కడి ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే సౌకర్యం ఉన్నా పట్టించుకోలేదన్నారు. భారీ వర్షాలు పడినప్పుడు గండ్లు పడి రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. డి-53, 64, 83ఎ, 83 బీ, నందిమేడారం , డి-63, 65, 67 చివరి వరకు నీరు అందించేలా శాశ్వత పరిష్కారానికి సీఎంను మూడుసార్లు కలిశానని తెలిపారు. త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా..

బుగ్గారం: బుగ్గారం మండలంలోని మద్దునూర్, యశ్వంతరావుపేట పంచాయతీ కార్యాలయాలను విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మండలంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్, ఉపాధ్యక్షులు నర్సాగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన జిల్లా జడ్జి

జగిత్యాలజోన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. రాజ్యాంగం విధివిధానాలు వివరించారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, మొదటి, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్‌లు జితేందర్, వినీల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్ పాల్గొన్నారు.



చిన్నారులతో జిల్లా జడ్జి నీలిమ

వాస్తవాలను వక్రీకరించేలా కవిత వ్యాఖ్యలు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీ కవిత వాస్తవాలను వక్రీకరించారని అన్నారు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి. ఓ యువకుడి బలవన్మరణానికి కారకుడన్న నేరారోపణపై జైలులో ఉన్న హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిపై బీఆర్ఎస్ హయాంలోనేనని, ఈ విషయాన్ని దాచి కాంగ్రెస్‌పై కవిత బురదజల్లే వ్యాఖ్యలు చేయడమేంటని ప్రశ్నించారు. ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మానవీయ కోణం మరిచిన కవిత 25 ఏళ్ల కుమారుడిని కోల్పోయిన బాధలో ఉన్న తల్లిని పరామర్శించకుండా రాజకీయ ప్రయోజనం కోసం రాజేశ్వర్‌రెడ్డిని జైలులో కలవడమేంటని ప్రశ్నించారు. యువకుడి ఇంటిపై నలుగురు దాడిచేయడంతో సదరు యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడని, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు నలుగురిపై గతేడాది అక్టోబర్ ఒకటిన కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. 2014కు ముందు ఎవరి ఆర్థిక స్థితిగతులు ఏమిటో అందరికీ తెలుసన్నారు. తమకు అధికారం కొత్తకాదని, బీఆర్ఎస్ నాయకులే అధికారంపోవడాన్ని భరించలేకపోతున్నారని తెలిపారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, ముస్కు దామోదర్‌రెడ్డి, సురేందర్ ఉన్నారు.

క్లుప్తంగా

నృసింహుని సన్నిధిలో జడ్జి



ఆలయంలో జడ్జి నారాయణ

సారంగాపూర్: బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహ స్వామిని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి నారాయణ దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ప్రసాదాలు అందించారు.

ఉపాధ్యాయుల డెప్యూటేషన్ రద్దు

జగిత్యాల: జిల్లాలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఫర్ ట్రెనింగ్ సెంటర్‌కు డెప్యూటేషన్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో డెప్యూటేషన్లను రద్దు చేస్తూ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులు తమతమ స్థానాల్లోనే విధులు నిర్వర్తించాల్సి వస్తుంది.

కెనాల్‌లో పడి వృద్ధుడు మృతి



నర్సింహులు(ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ డీ–86 ప్రధాన కెనాల్‌లో పడి మృతిచెందగా, మృతదేహం ఎలిగేడు మండలం ముప్పిరితోట శివారులో లభ్యమైంది. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణానికి చెందిన మత్స్యకారుడు పారుపల్లి నర్సింహులు(60) గురువారం సాయంత్రం ఎస్సారెస్పీ డీ–86 ప్రధాన కాల్వలో చేపలు పట్టేందుకు వెళ్లి కాలుజారి కెనాల్‌లో పడి కొట్టుకుపోయాడు. అతడికి ఈత వచ్చినా కెనాల్‌లో నీటి ప్రవాహం, ఉధృతికి ఫలితం లేకుండాపోయింది. నర్సింహులు ఇంటికి రాకపోయేసరికి అనుమానం వచ్చిన కటుంబసభ్యులు కెనాల్‌లో వెతికినా కనిపించలేదు. శుక్రవారం మృతదేహం ఎలిగేడు మండలం ముప్పిరితోట శివారులో తేలింది. స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ఎల్లయ్య (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనూర్ గ్రామానికి చెందిన యాదవసంఘం నాయకుడు బావు ఎల్లయ్య(75) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాలు.. వికలాంగుడైన ఎల్లయ్య కరీంనగర్‌లో త్రిచక్ర వాహనం కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా చల్మెడ ఆస్పత్రి వద్ద ఎదురుగా వస్తున్న లారీని అదుపుతప్పి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ బొంగోని రాజయ్యగౌడ్, వార్డు సభ్యుడు జీదుల దివాకర్, యాదవ సంఘం నాయకులు జంగం కొమురయ్య సందర్శించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.



ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణకు ప్రశంసాపత్రం ఇస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ఉత్తమ సేవలకు ప్రశంస

జగిత్యాలటౌన్: జగిత్యాల సమీకృత కార్యాలయ సముదాయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రశంసాపత్రాలు అందజేశారు.



సత్తమ్మ, ఉపాధి కల్యాణాధికారి; డా.జైపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో; డా.నరహరి, ఆర్థోపెడిక్ సర్జన్; ఆరిఫ్ అలీఖాన్, సీఐ; శ్రీధర్, ఎంపీహెచ్‌ఈవో; రాజేశ్వర్, డీఈ హౌసింగ్; ఎండీ.వకీల్, డీటీ; హరీశ్‌రావు, డీటీ; చంద్రశేఖర్, ఆడిటర్; గంగ లక్ష్మణ్ ఏపీవో, ఈజీఎస్; రమేశ్‌గౌడ్, మార్కెటింగ్ సెక్యూరిటీ సూపర్‌వైజర్; సురేశ్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్



భాస్కర్, సీనియర్ అసిస్టెంట్, భూసేకరణ; శశిధర్, సీనియర్ అసిస్టెంట్, ఎస్సీ కార్పొరేషన్; జాన్సన్, ఐసీడీఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్; శ్రీనివాస్, ఏపీవో; శ్రీనివాస్, జూ.అసిస్టెంట్ రెవెన్యూ; సతీశ్, ఎస్సై; శ్రీనివాస్, పీసీ; అల్లె రాజేందర్, సీనియర్ అసిస్టెంట్, డీపీవో ఆఫీస్

త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకోవాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్
- జిల్లాలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయం, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి, దేశానికి దిశానిర్దేశం చేశారన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతిఒక్కరూ విధులు నిర్వహించాలని సూచించారు. ఎందరో త్యాగధనుల ఫలితం ఈనాటి గణతంత్ర దినోత్సవమని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ప్రభాకర్‌రావు, భీంరావు, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, సురేశ్, రంగారెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు జానీమియా, రామకృష్ణ, వేణు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కార్యాలయాల్లో..

జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, రేంజ్ కార్యాలయంలో రేంజర్ ప్రణీత్ కౌర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో డీపీవో దేవరాజ్, జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి శివారు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీవో వంశీ జెండా ఎగురవేశారు. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నటేశ్, రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ ఆరిఫ్ అలీఖాన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సదాకర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రామచంద్రం జెండావిష్కరణ చేశారు.

ప్రత్యేక అధికారుల పాలన..!

- జాబితా సిద్ధం చేస్తున్న జిల్లా అధికారులు
- 1న ముగియనున్న సర్పంచుల పదవీకాలం



మ్యాకవెంకయ్యపల్లి జీపీ కార్యాలయం

పెగడపల్లి(ధర్మపురి): సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యుల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం లేదని, ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలోని 380 గ్రామ పంచాయతీలకు సంబంధించి వారి నియామకానికి కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ప్రత్యేక అధికారులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. మేజర్ జీపీలకు గెజిటెడ్ స్థాయి అధికారులను, మిగతా గ్రామాలకు మండల స్థాయి ఉద్యోగులను కేటాయించనున్నారు. జిల్లాలో ఎమర్జెన్సీ విధులు నిర్వహించే వైద్యారోగ్య, విద్యుత్, విద్యాశాఖలకు మినహాయింపు ఇస్తూ మిగతా శాఖల నుంచి అధికారులు, ఉద్యోగుల వివరాలు తీసుకుంటున్నారు. కొన్ని శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులనూ నియమించే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఈ నెల 29 లేదా 30న ఆదేశాలు వెలువడతాయన్న చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులను కొనసాగించనున్నట్లు సమాచారం.

ఇంకా ఆదేశాలు రాలేదు



ప్రత్యేకాధికారుల పాలన విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ఏ క్షణమైనా రావొచ్చు. అన్ని పంచాయతీలకు అవసరమైన అధికారుల జాబితా సిద్ధం చేస్తున్నాం. జీవో రాగానే నియామకాలు చేపడుతాం.

– దేవరాజ్, డీపీవో

ఇసుక లారీ పట్టివేత

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీరాంపూర్ రోడ్డు మూలమలుపు వద్ద తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పట్టుకున్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి తన వాహనంలో వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ఇసుక ఓవర్‌లోడ్ లారీ ఢీకొనే ప్రయత్నం చేయగా తహసీల్దార్ డ్రైవర్ చాకచక్యంగా తప్పించాడు. వెంటనే సదరు లారీని ఆపి పోలీసులకు సమాచారం అందించారు. అజాగ్రత్తగా, అతివేగంగా, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనంపై చర్య తీసుకోవాలని వారికి సూచించారు.

లారీ ఢీకొని మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

జగిత్యాల క్రైం: లారీ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. జగిత్యాల పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలంలోని ముత్యంపేటకు చెందిన మల్యాల కొండయ్య–లక్ష్మి (45) దంపతులు శుక్రవారం ఉదయం జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అక్కడి నుంచి ముత్యంపేట వెళ్తుండగా జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద లారీ అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కొండయ్యకు గాయాలయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన లారీడ్రైవర్ మదర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండిళ్లలో చోరీ

వెల్గటూర్ (ధర్మపురి): మండలంలోని పాశిగామలో శుక్రవారం తెల్లవారుజామున రెండిళ్లలో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసం సతీశ్, నలిమెల మల్లేశ్ కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా దుండగులు ఇళ్లలోకి చొరబడ్డారు. సతీశ్ ఇంట్లోని రూ.75 వేలు, మల్లేశ్ ఇంట్లోని రూ.31 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసులు వచ్చి, వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. పోలీసుల వివరాలు.. గురువారం సాయంత్రం బాలిక పేడ కోసం బయటకు వెళ్లిన సమయంలో మధుకర్ అనే వ్యక్తి లైంగికదాడికి యత్నించడంతో అతడి నుంచి బాధితురాలు తప్పించుకుంది. జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా కేవీ కేశవుల శత జయంతి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: స్వాతంత్ర సమరయోధులు కేవీ.కేశవుల శతజయంతిని ధర్మపురిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోదావరి సమీపంలోని కర్నె అక్కపల్లి కల్యాణ మండపంలో ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కేశవుల కూతురు ప్రణతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ.. ముందు తరాలకు గుర్తుండిపోయేలా పుస్తకాన్ని రచించినట్లు పేర్కొన్నారు. ఆమె రచించిన 'అదే నాన్నకు ప్రణతి' అనే పుస్తకాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం కేశవుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కర్నె అక్కపెల్లి నర్సింహులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కార్యదర్శులు మురళీధర్, రోహిత్, విశ్రాంత జడ్జి రాజన్న, కాంగ్రెస్ నాయకులు దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ, గుండి మహదేవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆ హెడ్మాస్టర్ మాకొద్దు'

- గణతంత్ర వేడుకల్లో ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎం మధ్య ఘర్షణ
- ఆయనను బదిలీ చేయాలంటూ విద్యార్థుల సంతకాల సేకరణ

మేడిపల్లి: భీమారం హైస్కూల్ హెడ్మాస్టర్ వెంకటరమణ ప్రవర్తన బాగాలేదని.. ఆయన మాకొద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం గణతంత్ర వేడుకల సందర్భంగా అనడం చర్చకు దారి తీసింది. ప్రధానోపాధ్యాయుడు, ప్రజాప్రతినిధుల మధ్య ఘర్షణ జరిగింది. విద్యార్థుల పట్ల హెచ్‌ఎం వైఖరి అసభ్యంగా, ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ చైర్మన్, తోటి ఉపాధ్యాయులతో సమన్వయలోపం ఉన్నట్లు తెలిపారు. నాలుగు నెలలుగా ఎవరికీ సహకరించడం లేదని, పిల్లల చదువులపై అవగాహన లేకుండా ప్రవర్తిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఏదైనా విషయమై సలహాలు అడిగితే వారిని దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. అనంతరం హెడ్మాస్టర్ మాకొద్దంటూ పిల్లల నుంచి సంతకాలు సేకరించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. హెచ్‌ఎం వెంకటరమణ మరోచోటుకు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని, లేదంటే టెన్త్ ఎగ్జామ్స్ రాయబోమని పదోతరగతి విద్యార్థులు అన్నారు. ఇంతకుముందు భీమారం హైస్కూల్లో ఇలాంటి ఘటనలు చూడలేదని, ఇవి విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి, సాధ్యమైనంత త్వరగా ఈ హెడ్మాస్టర్‌ను ఇంకోచోటుకు బదిలీ చేసి, స్కూల్ వాతావరణాన్ని కాపాడాలని కోరారు. ఆయనను బదిలీ చేయకపోతే ధర్నాకు దిగుతామని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై హెచ్‌ఎం వెంకటరమణను వివరణ కోరగా పిల్లలను అదుపు చేసే క్రమంలో కొంచెం కటువుగా ప్రవర్తించినట్లు తెలిపారు. వారు అపార్థం చేసుకొని, తల్లిదండ్రులకు చెప్పారని, దీన్ని ప్రజాప్రతినిధులు రాజకీయం చేసే యోచనలో ఉన్నారని పేర్కొన్నారు. అన్నీ త్వరలోనే సర్దుకుంటాయని, పాఠశాలలో రాజకీయాలు చేయొద్దని ఆయన కోరారు.

మేడారం భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు



మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్: మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు సూచించారు. మేడారం మహాజాతర ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరుగనున్న నేపథ్యంలో 11 డిపోలకు చెందిన డీఎంలు, మెకానిక్ సూపర్‌వైజర్లతో శుక్రవారం బస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు ఎక్కడికక్కడ సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా రవాణా సౌకర్యం, భక్తులకు విడిది, ఇతరత్రా ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఎం సుచరిత, వివిధ విభాగాల అధికారులు సుగుణాకర్, భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎం.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకముందు ఆర్టీసీ ఈడీ రఘునాథరావు కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బస్సులను, ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు.

రేషన్ బినామీ డీలర్లలో గుబులు

- బినామీలను తొలగించేందుకు సిద్ధం
- రంగంలోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు



బియ్యం పంపిణీ

ధర్మపురి: ఇప్పటివరకు రేషన్ డీలర్లలో పేరు ఒకరుంటే నిర్వహణ మరొకరు నిర్వహించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రేషన్ దుకాణాల్లో డీలర్ పేరు ఎవరి పేరిట ఉంటే వారే నిర్వహించాలని పౌర సరఫరాల శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కమీషన్లు ఇచ్చి బినామీలుగా కొనసాగిన వారికి గడ్డుకాలం ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. రేషన్ దుకాణాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. రేషన్ దుకాణాల్లో కుటుంబసభ్యులు మినహా డీలర్ ఎవరి పేరుందో వారే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. రేషన్ దుకాణాలను నడిపించుకునేందుకు బినామీ డీలర్లను తొలగించుటకు ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు రంగంలోకి దిగాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో రేషన్‌షాపుల్లో తనిఖీలు చేపడుతూ బీనామీలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోనున్నారు. రేషన్‌షాపుల నిర్వాహకుల్లో బినామీలు ఉన్నారని ఫిర్యాదులు వచ్చినప్పటికీ పౌర సరఫరాల, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం బినామీల ఏరివేతకు రంగం సిద్ధం చేయాలని ఆదేశించింది.

ఈ నెల 31లోగా..

బినామీల ఏరివేతను ఈనెల 31లోగా పూర్తి చేయాలని, మండలాల వారిగా నివేదికలు సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు రంగంలోకి దిగి రేషన్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. షాపు ఎవరి పేరిట ఉంది..? నెలనెలా బియ్యం ఎలా పంపిణీ చేస్తున్నారు..? డీలర్ చనిపోతే ఎప్పుడు చనిపోయాడు..? కుటుంబ సభ్యులు ఎవరు నిర్వహిస్తున్నారు..? తదితర అంశాలను పరిశీలించి 31 లోగా నివేదికలు సమర్పించాలి.



ఆయిల్‌పాం స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్..



గర్భిణులకు పండ్లు పంపిణీ

ఆకట్టుకున్న స్టాళ్లు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రిపబ్లిక్ డేలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు శుక్రవారం స్టాళ్లు ఏర్పాటు చేశాయి. జిల్లా అధికారులతోపాటు ప్రజలు వాటిని సందర్శించారు. జిల్లా వైద్య, ఆరోగ్య, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పశు సంవర్ధక, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు, దివ్యాంగుల అభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన శాఖలు, రోడ్డు రవాణా సంస్థ అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించారు. పలువురు మహిళలు తాము తయారు చేసిన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, అడిషనల్ కలెక్టర్లు బీఎస్.లత, దివాకర, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సందర్శించి, నిర్వాహకులను అభినందించారు. గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు.